BHARATH SAMACHAR DIGITAL

13, నవంబర్ 2026, శుక్రవారం భారత్ సమాచార్

# మంత్రాల నెపంతో ఇద్దరి దారుణ హత్య..




**భారత్ సమాచార్, తెలంగాణ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం బుడుగుల గూత్తికోయ గ్రామంలో మూఢనమ్మకాలు ఒకే కుటుంబంలో నలుగురి ప్రాణాలను బలిగొన్నాయి. చేతబడి చేస్తున్నారనే అపోహతో కొందరు దుండగులు ఇద్దరు వృద్ధులను కర్రలతో కొట్టి అత్యంత కిరాతకంగా హత్య చేయగా, వారిని చంపినవారే తమను కూడా అంతమొందిస్తారనే తీవ్ర భయంతో మృతుడి కుమారుడు, కోడలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వరుస మరణాలతో మారుమూల అటవీ ప్రాంతమైన బుడుగుల గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

వివరాల్లోకి వెళితే.. బుడుగుల గ్రామానికి చెందిన పద్దం మాసయ్య, ఆళ్లపల్లి మండలం భూసురాయి గ్రామానికి చెందిన ఆయన బంధువు భీమయ్యలు మంత్రాలు చేస్తూ గ్రామస్థులకు హాని తలపెడుతున్నారని స్థానికుల్లో కొందరు కక్ష పెంచుకున్నారు. నెల రోజుల క్రితం మాసయ్య మనమరాలికి అనారోగ్యం కలగడంతో భీమయ్య వచ్చి పూజలు చేశాడు. ఇదే అదనుగా భావించిన దుండగులు, వారి పూజల వల్లే గ్రామంలో మరణాలు సంభవిస్తున్నాయని ఆరోపిస్తూ ఇద్దరినీ కర్రలతో కొట్టి చంపి, సమీప అడవిలోని చెక్‌డ్యామ్ వద్ద మృతదేహాలను పాతిపెట్టారు. భీమయ్య కుమార్తె ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన మణుగూరు సీఐ నాగబాబు బృందం, ఈ దారుణంలో ఐదుగురు వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు గుర్తించి వారి కోసం గాలిస్తోంది.

మరోవైపు, మంత్రాల నెపంతో తన తండ్రి మాసయ్యను హత్య చేసిన దుండగులు తమను కూడా ప్రాణాలతో వదలరని ఆయన కుమారుడు రాంబాబు (30), కోడలు సునీత (25) తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ క్రమంలోనే బలవన్మరణానికి నిర్ణయించుకున్న ఆ దంపతులు, రాత్రి వేళ ఇప్పసారాయిలో పురుగుల మందు కలుపుకుని తాగారు. అపస్మారక స్థితిలో ఉన్న వారిని గమనించిన స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయగా, మార్గమధ్యంలోనే సునీత ప్రాణాలు కోల్పోయింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రాంబాబు కూడా మృతి చెందడంతో గ్రామంలో విషాదం మరింత తీవ్రమైంది.

సాంకేతికత ఎంతగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, నేటికీ మారుమూల గిరిజన ప్రాంతాల్లో మూఢనమ్మకాలు వేళ్లూనుకుని ఉండటంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కేవలం అపోహలతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు అర్ధాంతరంగా తనువు చాలించడం జిల్లావ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, పరారీలో ఉన్న నిందితులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.